క్లుప్తంగా

కౌలురైతు కార్డుల మంజూరుపై గ్రామసభ

జి.కొండూరు: కౌలురైతు కార్డులను మంజూరు చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు కుంటముక్కల పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీఎస్ చైర్మన్ పాడిబండ్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రామంలో 500 మందికిపైగా కౌలుదారులు ఉన్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ కార్డులను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వి చింతయ్య, ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గంపలగూడెం: వివిధ రకాల సర్టిఫికెట్లను పొందేందుకు ప్రజలు వలంటీర్ల ద్వారా ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. పలు సర్టిఫికెట్లు పొందేవిషయమై ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జూలై ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జనన, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తదితర ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం సభల్లో పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం ముందుగా ప్రజలు తమ అవసరమైన సర్టిఫికెట్ల కోసం కావలసిన పత్రాలను, వలంటీర్లకు అందజేయాలని తెలిపారు.

రైతుల సహకారం అభినందనీయం

పెనుగొలను(గంపలగూడెం): రైతులు తమ అవసరాలకు సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా బ్యాంకుల్లో తమ పరపతి పెంచుకోవాలని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెనుగొలను పీఏసీఎస్‌లో ఈ ఏడాది రైతు రుణాలు నూరుశాతం వసూలు చేయడంపై ఆయన సొసైటీ సీఈఓ నామా నరసింహారావు, సిబ్బందిని శుక్రవారం బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. రుణాల చెల్లింపు విషయమై ఈ ప్రాంత రైతాంగం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. మేనేజర్ కనకదుర్గ, సూపర్‌వైజర్ కొండయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



నూజివీడు: మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఉన్నతమైన భవిష్యత్తును ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. పట్టణంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా శుక్రవారం వాగ్దేవి కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన డీఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ టీ గోపాలకృష్ణ, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్‌బాబు, వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీ కుమార్, నవజీవన్ బాలభవన్ జోనల్ కో–ఆర్డినేటర్స్ రవి, ఆంజనేయులు, రమేష్, ప్రియాంక పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

తిరువూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు కలసి ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్నీ విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ప్రజాసంఘాలు సంయుక్త కార్యాచరణ రూపొందించాలన్నారు.

ఆ ఆరోణలు అవాస్తవం

గంపలగూడెం: చింతలనర్వ గ్రామానికి చెందిన కొన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు తనపై చేసిన అవినీతి ఆరోపణలు అవాస్తవమని వీఓఏ గద్దల సుజాత ఖండించారు. గ్రామానికి చెందిన స్వయం సహాయ సంఘాల గ్రూపులకు రుణాలు మంజూరు, విడుదల సందర్భంగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీఓఏ)గా తాను ఎవరిని లంచం డిమాండ్ చేయలేదని తెలిపారు. ఒక గ్రూపునకు సంబంధించి బ్యాంకులో సాంకేతిక సమస్య కారణంగానే వారి పేరిట బాకీ ఉన్నట్లు కనిపించిందని, తదుపరి ఆ తప్పును సరిచేయించి, వారి పేరిట ఏ బాకీ లేదని బ్యాంకు అధికారులే తేల్చి చెప్పారని పేర్కొన్నారు. ఈ విషయంలో తానేమి అక్రమాలకు పాల్పడలేదని తెలిపారు. ఆసరా నగదు విషయమై తనపై చేస్తున్న ఆరోపణల్లో కూడా నిజం లేదని సుజాత పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మల్లేల(తిరువూరురూరల్): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని మల్లేలలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికీ లక్షల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని, ఇంకా అర్హత ఉండీ పథకాలందని వారు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక తదితర పథకాల ద్వారా చదువులకు అవసరమైన డబ్బు ప్రభుత్వమే భరిస్తోందన్నారు. డ్వాక్రా మహిళలకు, రైతులకు, ఆటోడ్రైవర్లకు, టైలర్లకు, నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదన్నారు. మల్లేల పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవికుమార్, సర్పంచ్ వంగూరి మరియమ్మ, ఉప సర్పంచ్ సువర్చల, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, మామిడి కుటుంబరావు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్సు వీక్షించిన ఎమ్మెల్యే

తిరువూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సును వారు వీక్షించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మండల స్థాయి అధికారుల బృందాల విధులను ఎమ్మెల్యే రక్షణనిధి, ఎంపీడీఓ నాగేశ్వరరావు వివరించారు.



జగనన్న సురక్ష వీడియో కాన్ఫరెన్సు వీక్షిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పేదలకు అన్నదానం చేయడం భగవంతుని సేవే

మైలవరం: పేదలకు అన్నదానం చేయడం భగవంతునికి సేవ చేయడమేనని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రం వద్ద శుక్రవారం చలివేంద్రం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని నెల రోజులకుపైగా ప్రజల దాహార్తిని తీరుస్తూ, అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆలమూరి చంద్రశేఖర్, ఐ నీడ్స్ పుల్లారెడ్డి, పాల నారాయణరెడ్డి, కాజా మనోహర్, మనసం సుధాకర్, మల్లికార్జునరెడ్డి, డీటీడీసీ మల్లికార్జునరావు, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ రమేష్, నిర్వాహకులు

నాగులూరు కాంప్లెక్స్ చైర్మన్‌కు సత్కారం

రెడ్డిగూడెం: మండలంలోని నాగులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు నియమితులైన హెచ్ఎం ఎం.వరలక్ష్మిని, గత కాంప్లెక్స్ చైర్మన్ వరద శ్రీనివాసరావును ఎస్టీయూ మండల శాఖ సభ్యులు ఆ హైస్కూల్లో శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహప్రసాద్, మండల అధ్యక్షుడు బి. అనిల్‌కుమార్, నాయకులు ప్రేమ్‌కుమార్, నాగరాజు, సీతారెడ్డి, శ్రీనివాసరావు, ద్వారకానాథ్, పవన్, పిచ్చియ్య, ఆదాము, అంజనాదేవి, రజిని, సుధా, నాగమణి, సునీత పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేయాలి

నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



లోపూడిలో జగనన్న సురక్ష సర్వేపై సమీక్షిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ముసునూరు: మండల వ్యాప్తంగా ‘జగనన్న సురక్ష’ను నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని ఆ కార్యక్రమ మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చ్యువల్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి శుక్రవారం ఆయన వీక్షించారు. అనంతరం లోపూడి గ్రామ సచివాలయాన్ని సందర్శించి, కార్యక్రమ నిర్వహణకు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. జగనన్న సురక్ష పథకం సర్వేను తమ తమ క్లస్టర్ల పరిధిలో వలంటీర్లు సక్రమంగా, సమగ్రంగా పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణలో సందేహాల నివృత్తికి ప్రత్యేకాధికారులు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది తక్షణ స్పందనతో వలంటీర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి సమస్యను పరిష్కరించాలి

చాట్రాయి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లో అమలు చేయాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. మండలంలోని చాట్రాయి, చనుబండ గ్రామాల్లోని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు, గృహసారథులకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ పరిధిలో అర్హత కలిగి ఏ ఒక్కరూ లబ్ధిపొందకుండా మిగిలి పోకూడదనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఎంఎల్‌ఓ లాము నరేష్ వలంటీర్లకు గృహ సారథులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గాప్రసాదు, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

నూజివీడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరేపల్లి శిరీష మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మండల ప్రత్యేకాధికారి, హార్టీకల్చర్ డీడీ ఎస్ రామ్మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీడీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విధివిధానాలపై సమావేశాలు

తిరువూరురూరల్: మండలంలోని చింతలపాడు, ఎర్రమాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్జీదారులకు ఉచితంగా పలు ధ్రువపత్రాలను జారీ చేసేందుకు కూడా ప్రభుత్వం ఆదేశించినందున దరఖాస్తులు స్వీకరించి వాటి రశీదులను అందజేయాలని ఎర్రమాడు సర్పంచ్ మాధవి సూచించారు.

‘జగనన్న సురక్ష’పై దిశానిర్దేశం

జి.కొండూరు: ప్రజలకు అవసరమైన పలు ధ్రువీకరణపత్రాలను నేరుగా ఇంటి వద్దకే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విధి విధానాలపై ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి స్థానిక కమ్యూనిటీహాల్లో ఎంపీడీఓ శుక్రవారం దిశానిర్దేశం చేశారు. ముందుగా ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి మాట్లాడిన ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్‌పై అధికారులు వీక్షించారు. అనంతరం కార్యక్రమం షెడ్యూలు, విధి విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కారించాలి

రెడ్డిగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాలలో ప్రజా సమస్యలు, వ్యక్తిగత సమస్యలు పెండింగ్ లేకుండా పరిష్కారం చేయటానికి ఒక మంచి వేదిక కావాలని మండల ప్రత్యేక అధికారి ఎం. రుక్మాంగదయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో మండల ప్రత్యేకాధికారి మాట్లాడారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, వలంటీర్లు ద్వారా సేకరించిన గ్రీవెన్స్‌ను గ్రామస్థాయిలోనే పరిష్కరించనున్నట్లు ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

‘జగనన్న సురక్ష’కు ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ప్రతి గడపకు వలంటీర్‌లు వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారిని గుర్తిస్తారని పేర్కొన్నారు. అర్హులైన వారికి గ్రామ సచివాలయాల నుంచి వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

ప్రతి ఇంటినీ సందర్శించాలి

మైలవరం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ విధి విధానాల ప్రకారం తక్షణమే తగు చర్యలు చేపట్టాలన్నారు.

యువకుడి అసభ్య ప్రవర్తనపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ టైలర్‌పేటకు చెందిన ఓ బాలిక (13) చిట్టినగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. 22వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటకు వెళ్లి ఇంటికి వస్తోంది. అదే సమయంలో ఇంటి యజమాని కుమారుడు రమణారావు బాలిక వెనుక నుంచి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పింది. ఘటనపై తండ్రి కొత్త పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అలరించిన సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు ఆరాధనా సంగీతోత్సవాల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు భావరస గంగా ప్రవాహంలా సాగుతున్నాయి. చెంగల్వల రంజని గాత్రంతో శుక్రవారం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాగంపూడి అమూల్య, హేమాద్రి చంద్రకాంత్, బీవీ దుర్గాభవాని, ద్రోణేంద్రఫణికుమార్ వేణుపై ఆకాశవాణి నిలయ విద్వాంసురాలు బీవీ దుర్గాభవాని వాగ్గేయకారుల కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో వాయిద్య సంగీత కళాకారులు సద్గురు చరణ్, పెరవలి నందకుమార్, గజ్జెల సతీష్‌బాబు, జగన్మోహిన పాల్గొన్నారు. నిర్వాహకుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ 25వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు సంగీత ఉత్సవాలు జరుగుతాయని ఉదయం పంచరత్న కీర్తనల గోష్ఠిగానం ఉంటుందని తెలిపారు.



చెంగల్వల రంజని గాత్ర విన్యాసం వాద్య సహకారం అందిస్తున్న ఇభానన్, చంద్రకాంత్

ముత్యాలమ్మకు శాకంబరి అలంకారం

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో గ్రామదేవత ముత్యాలమ్మకు ఆషాఢమాసం సందర్భంగా శిరిడీసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, శాకంబరి అలంకారం చేశారు. శివాలయం అర్చకులు డి.రామలింగేశ్వరశర్మ ముందుగా అమ్మవారికి అభిషేకం చేసి నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం వివిధ రకాల కూరగాయాలు, ఆకు కూరలతో విశేష అలంకరణ చేశారు.



అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

నూజివీడు: ఆగిరిపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బీజేపీ మహిళా మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి శుక్రవారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆమె మండలంలోని నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, ఆగిరిపల్లి-2, ఆగిరిపల్లి-3 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు, మధ్యాహ్న భోజనం పిల్లలకు సక్రమంగా అందుతుందా, లేదా అని పరిశీలించారు. డ్వాక్రా మహిళలను కలిసి పావలా వడ్డీ రుణాలు, పీఎం మాతృవందన యోజన, ఉజ్వల యోజన తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల వివరించారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

గోపవరం(ముసునూరు): తాగునీటి సమస్యపై స్పందించి పరిష్కరించడంతో గోపవరం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్ద గ్రామం గోపవరం యాదవ బజారు ఏరియాలో గురువారం తాగునీటి మోటారు మొరాయించింది. దీనికి తోడు బోరులో పూడిక పేరుకు పోయింది. సమాచారం అందుకున్న సర్పంచ్ కంచర్ల వాణి స్పందించి, బోరులో పూడిక తీయించి, మోటారు బిగించారు. బురద నీరు వస్తుండడంతో మోటారును బయటకు తీయించారు. ఇటీవలే వేయించిన నూతన బోరుకు మోటారును శుక్రవారం మధ్యాహ్ననికి రెడీ చేశారు. సర్పంచ్ తక్షణ స్పందనకు స్థానికులు అభినందనలు తెలిపారు.



గోపవరంలో మోటారు బిగిస్తున్న సిబ్బంది

పీహెచ్‌సీ వైద్యాధికారిగా విజయలక్ష్మి

చాట్రాయి: పీహెచ్‌సీ వైద్యాధికారిగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి లీనా బెంజిమెన్ బదిలీ అయ్యారు.

విత్తనాల కొనుగోలుపై అప్రమత్తంగా ఉండాలి

మొర్సుమల్లి(మైలవరం): ఖరీఫ్ పంట కాలం ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మండల అధికారి సంధ్యారాణి తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలోని విత్తన విక్రయ దుకాణాలను వ్యవసాయ శాఖ మండల అధికారి సంధ్యారాణి శుక్రవారం తనిఖీ చేశారు. లైసెన్స్ ఉన్న విత్తన దుకాణాల నుంచి మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లులు కచ్చితంగా తీసుకుని, పంట కాలం పూర్తయ్యేవరకు వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. విత్తనానికి సంబంధించిన ట్యాగులు, సంచులు భద్రపర్చుకోవాలన్నారు. లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద లూజు విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా ఉండాలని తెలిపారు. విత్తన షాపుల యజమానులు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు ఎక్కువగా ఉపయోగించే పత్తి విత్త రకాలను ఎక్కువ ధరకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. పత్తి పంట వేసే రైతులు ఒకే విత్తన రకానికి బదులు వారి విస్తీర్ణాన్ని బట్టి రెండు నుంచి మూడు రకాలు వేసుకోవాలని సూచించారు. అనుమతి లేని గ్లైసైల్ పత్తి విత్తనాలు కొనటం, సాగు చేయడం నిషేధం కాబట్టి రైతులు వాటిని సాగు చేయరాదని హెచ్చరించారు.



విత్తనాల విక్రయ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న సంధ్యారాణి

రాంప్రసాద్ మృతి తీరని లోటు

ఎమ్మెల్యే వసంతవెంకట కృష్ణప్రసాద్



రాంప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పెడనలో తనకంటూ ఓ సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్న ఉప్పాల రాంప్రసాద్ మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. పెడన మండలం కూడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన విషయం విదితమే. ఉప్పాల నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే వసంత రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంప్రసాద్ కోడలు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రాము, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మారుతున్న టెక్నాలజీకి లైనెక్స్ ఉపయోగకరం

మైలవరం: నేడు మారుతున్న టెక్నాలజీకి రెడ్ హెట్ లైనెక్స్ ఎంతో ఉపయోగకరమని హైదరాబాద్ ప్రోడవెంట్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ రిసోర్స్‌పర్సన్, టెక్నికల్ కన్సల్టెంట్ జే ప్రవీణ్ తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాల ఆధ్వర్యంలో రెడ్ హెట్ లైనెక్స్ అనే అంశంపై ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రెండు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. రిసోర్స్‌పర్సన్ ప్రవీణ్ మాట్లాడుతూ రెండు రోజులు విద్యార్థులకు రెడ్ హెట్ లైనెక్స్‌లో అన్ని కీలక అంశాలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. సీఎస్ఈ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ డి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సాధారణ ఓఎస్ అప్‌డేట్‌లతో పాటు, రెడ్ హెట్ లైనెక్స్ ఎనిమిది నిర్దిష్ట అప్లికేషన్‌లకు మద్దతు ఇవ్వడానికి, బేస్ ఓఎస్ నుంచి స్వతంత్రంగా అప్‌డేట్ చేయడానికి, అప్లికేషన్ వెండర్ మెయింటెనెన్స్ స్ట్రీమ్‌తో పరిపోల్చడానికి అప్లికేషన్ స్ట్రీమ్‌లను కూడా నిర్వహిస్తుందన్నారు. వర్క్‌షాపు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.జయప్రద, డాక్టర్ ఎస్. నాగార్జున రెడ్డి, ఏఎస్ఆర్‌సీ మూర్తి, ఎస్ శ్రీనివాసరావు, ఎం.స్వాతి పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ప్రవీణ్, జయప్రద

జేఈఈ ర్యాంకర్‌కు అభినందన

ఇబ్రహీంపట్నం: జేఈఈ అడ్వాన్సడ్ ఫలితాల్లో కొండపల్లికి చెందిన రాగాల నిఖిల్ జాతీయ స్థాయిలో ఎస్టీ విభాగంలో 317 ర్యాంకు సాధించిన సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు స్వగృహంలో శుక్రవారం విద్యార్థిని సత్కరించినట్లు డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ తెలిపారు. నిఖిల్‌ను పీసీసీ ఉపాధ్యక్షుడు మురళీ మోహనరావు, జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీసీపీ కార్యదర్శి ఏసుదాస్ అభినందించారు.



నిఖిల్‌ను సత్కరిస్తున్న నాయకులు

శ్రీఫుడ్ ఫ్యాక్టరీకి అవార్డు

నూజివీడు: పట్టణానికి చెందిన శ్రీఫుడ్ ఫ్యాక్టరీ అధినేత, పోతురెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అక్కినేని శ్రీదేవి రాజమండ్రిలో నిర్వహించిన ప్రాంతీయ వర్క్‌షాప్‌లో ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ స్కీంలో భాగంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ నుంచి శుక్రవారం అవార్డు అందుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ అండ్ సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి చేతులు మీదుగా బెస్ట్ మైక్రో ప్రాసెసింగ్ యూనిట్ అవార్డును అందుకున్నారు. శ్రీదేవి ఫుడ్‌కు సంబంధించిన పదార్థాలు తయారు చేసే ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి మెరుగైన పనితీరు, వ్యాపారం చేసినందుకు ఈ అవార్డును అందుకున్నారు.



చిరంజీవి చౌదరి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అక్కినేని శ్రీదేవి

విద్యార్థులకు రూ.25వేల వితరణ

నూజివీడు: ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ స్కూల్ విద్యార్థుల కోసం జొన్నల సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, శివకుమారి దంపతులు తమ 50వ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రూ.25వేల నగదును స్కూల్ సీఈఓ అజయ్ కుమార్‌కు వితరణగా అందజేశారు. అమెరికాలో ఉంటున్న మనుమడు సుదీప్‌చందర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని హీల్ స్కూల్ విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా హీల్ యాజమాన్యం ఆ దంపతులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సబ్ స్టేషన్ మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు నల్లకుంట, శాంతినగర్, రాయనపాడు, పైడూరుపాడు, సూరాయపాలెం, కరకట్ట, పోస్టాఫీస్ రోడ్, నేతాజీనగర్, వాటర్ ఫిల్టర్ బెడ్ ఏరియా, గంగానమ్మ గుడి ఏరియా, పంచాయతీ కార్యాలయం ఏరియా, వన్‌సెంటర్ ఏరియా, అయ్యప్పస్వామి టెంపుల్ ఏరియా, దత్త కల్యాణమండపంఏరియా, మరనాత చర్చి ఏరియా, వాసవి ఫార్మా మెడికల్ కాంప్లెక్స్, వస్త్రలత కాలనీ, ట్రిబుల్ ఎస్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.